www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | బుధ వారం, 30 నవంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-199 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# షర్మిల అరెస్ట్

## కోర్టుకు హాజరు పరిచిన పోలీసులు ● బెయిల్ మంజూరు



- ప్రగతి భవన్‌కు వెళ్లేందుకు షర్మిల యత్నం
- అడ్డుకుని అరెస్ట్ చేసి ఎస్సార్ నగర్‌కు తరలించిన పోలీసులు
- విజయమ్మను ఇంటి వద్దే అడ్డుకున్న పోలీసులు
- ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించిన షర్మిల



2లో

## నివాసయోగ్యమైన ఉత్తమ నగరంగా హైదరాబాద్

హైదరాబాద్‌ను ఎకో ఫ్రెండ్లీ నగరంగా తీర్చి దిద్దుతున్నాం



రీ ప్లానెట్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నవంబర్ 29 (సమ సమాజం):** దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన ఉత్తమ నగరంగా హైదరాబాద్ ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. విశ్వనగరం హైదరాబాద్‌కు ఎన్నో అంతర్జాతీయ అవార్డులు, గుర్తింపు దక్కాయని తెలిపారు. ప్రపంచంలోనే నెంబర్ వన్ ఎకో ఫ్రెండ్లీ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

3లో



## గుజరాత్ ఎన్నికల్లో ఆప్ దూకుడు

మీరంతా భారతరత్నకు అర్హులే

వజ్రాల వ్యాపారులకు కేజ్రీవాల్ వల

**అహ్మదాబాద్, నవంబర్ 29 (సమ సమాజం):** డిసెంబర్ మొదటి వారంలో జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని ప్రధాన పార్టీ నేతలు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ గుజరాత్ వ్యాపారులను ఆకర్షించలా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో సహకరిస్తున్న వారికి, వారి కృషికి భారతరత్నను ప్రదానం చేయాలని అన్నారు. గుజరాత్‌లో మొదటి దశలో ఎన్నికలకు వెళ్లడానికి కేవలం రెండు రోజులే ఉన్నప్పుడు, సంప్రదాయ బీజేపీ కంచుకోటను ఛేదించడానికి కేజ్రీవాల్ ప్రయత్నం ముమ్మరం చేస్తూ వ్యాపారులను ఆకట్టుకుంటున్నారు. నిజానికి వారి సేవలు భారతయోత్నకు

3లో

## స్కూళ్లు తెరిచేలోగా యూనిఫామ్ రెడీ

అధికారులకు ముందే ఆదేశించిన మంత్రి సబిత



**హైదరాబాద్,నవంబర్29(సమ సమాజం):** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు రానున్న విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల పునః ప్రారంభ సమయంలోనే ఏకరూప దుస్తులను అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఏకరూప దుస్తులను ధరించి తరగతులకు హాజరైతే వారిలో క్రమశిక్షణ

2లో



## ఉద్యోగ నియామకాల పక్రియపై సిఎస్ సమీక్ష

మరో 16,940 పోస్టులకు మూడు రోజుల్లో అనుమతులు

జలవనరుల శాఖలో 57 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

2లో

## మొబైల్ ఛార్జింగ్‌తో షాక్



మృతి చెందిన పదేళ్ల బాలిక

**జోగులాంబ గద్వాల, నవంబర్ 29 (సమ సమాజం):** మొబైల్ చార్జింగ్ పెట్టి తీస్తుండగా కరెంట్ షాక్ కొట్టడంతో ఓ బాలిక మృతి చెందింది. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా, ఈడిగోనిపల్లి గ్రామంలో జరిగింది. బసవరాజు, జయంతిల కుమార్తె పదేళ్ల నిహారిక నాల్గవ

3లో

## ఫిబ్రవరి 1నుంచి 4 వరకు మేడారం మినీ జాతర



**ములుగు, నవంబర్ 29 (సమ సమాజం):** మేడారం మినీ జాతర తేదీలను మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర పూజారుల సంఘం ప్రకటించింది.

3లో

## మధ్యప్రదేశ్‌లో కొనసాగుతున్న రాహుల్ యాత్ర

సన్వెర్ పట్టణం నుండి ఉజ్జయినికి బయలుదేరిన రాహుల్



**భోపాల్, నవంబర్ 29 (సమ సమాజం):** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మధ్యప్రదేశ్‌లో కొనసాగుతోంది. మధ్యప్రదేశ్ లో ఏడో రోజుకు చేరిన ఈ యాత్రను మంగళవారం ఇండోర్ జిల్లాలోని సాన్వెర్ పట్టణం నుండి ప్రారంభించారు. సన్వెర్ పట్టణం నుండి ఉజ్జయినికి బయలుదేరిన ఈ యాత్రలో మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ సింగ్, మాజీ పార్లమెంటేరియన్ ప్రేమ్ చంద్ గుడ్డు, మాజీ మంత్రి కమలేశ్వర్ పటేల్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు రాహుల్ పాదయాత్ర ప్రారంభించారు. పార్టీ మహిళా ప్రతినిధులు నూరీ ఖాన్, అర్చన జైస్వాల్ తదితరులు పాదయాత్రలో రాహుల్ గాంధీ వెంట నడిచారు. పలుచోట్ల ప్రజలనుద్దేశించి మాట్లాడిన రాహుల్ గాంధీ టీవీల్లో మోడీని పొగిడే కార్యక్రమాలే ఎక్కువయ్యాయని..

3లో

## తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు పోరాటం



కెసిఆర్ అవినీతి సొమ్మును కక్కిస్తాం

ఎన్నికలు ఎప్పుడు జరిగినా బిజెపిదే అధికారం

తెలంగాణలో శాంతిభద్రతలు క్షీణించాయన్న కిషన్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 29 (సమ సమాజం):** తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ,పరిరక్షణ కోసం, కుటుంబ పాలనకు వ్యతిరేకంగా, ఈ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అవసరమైతే

3లో

## భైంసాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తా



అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తేస్తాం

భైంసా పేరు మైసాగా మార్చేస్తాం

ఎన్నికలు ఎప్పుడు జరిగిన బిజెపిదే అధికారం

ప్రజా సంగ్రామ యాత్ర సభలో బండి సంజయ్

3లో

## తనను చంపుతానంటూ కవిత బెదిరించారు

చర్య తీసుకోవాలంటూ హైకోర్టులో అర్వింద్ పిటిషన్




**హైదరాబాద్, నవంబర్ 29 (సమ సమాజం):** ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై

3లో

## ప్రజలకోసం పనిచేయండి

రాజకీయాల్లో పరస్పర దూషణలు సహజమే

ఎంపి అర్వింద్ పిటిషన్ పై హైకోర్టు వ్యాఖ్య



**హైదరాబాద్, నవంబర్ 29 (సమ సమాజం):** నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ పూరత్యయ్యింది. ఎమ్మెల్సీ కవిత మాట్లాడిన తీరుపై ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. రాజకీయ నాయకులు ఒకరి మీద ఒకరు మాట్లాడుకోవడం తరచూ జరిగేదేనని హైకోర్టు పేర్కొంది. ప్రజా ప్రతినిధులు ప్రజల కోసం పని చేయాలని సూచించింది. బయట జరిగే రాజకీయ పరిణామాలను తాము మీడియా, పత్రికల్లో చూస్తున్నామని హైకోర్టు పేర్కొంది. ఎమ్మెల్సీపై కేసు నమోదు చేయాలని పిటిషన్ కౌన్సిల్ రచనా రెడ్డి కోరారు. కరీంనగర్ సర్కిల్‌లో అరవింద్ ని అటాక్ చేస్తామని బెదిరించారని రచన తెలిపారు. ఇప్పటికే బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి చర్యలు తీస్కున్నారని అడ్వొకేట్

3లో

# సంపాదకీయం

## ఆర్థిక దివాళా పథకాలను రద్దు చేయాల్సిందే !

పథకం ఏదైనా పాలకుల దృష్టి కోణం మాత్రం ఓటే... ఏ పథకమయినా ఓటును దృష్టిలో పెట్టుకునే ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రాల ఆర్థిక ప్రగతి కుంటుపడుతోంది. అభివృద్ధి కార్యక్రమాలు వెనక్కి పోతున్నాయి. కనీసం రోడ్లు కూడా వేయలేని దుస్థితిలో అనేక రాష్ట్రాలు ఉన్నాయి. ఇందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలు కూడా మినహాయింపు కాదు. తెలుగు రాష్ట్రాల్లో రోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. వాహనాలు నడపాలంటేనే భయం కలుగుతోంది. దేశం లేదా రాష్ట్రాల్లో మౌళిక వసతులు పెంచి, ప్రజల జీవన ప్రమాణాలకు అనుగుణంగా విద్యా వైద్యంతో పాటు ఉపాధి రంగాలను ప్రోత్సహించాల్సిన పాలకులు తాత్కాలిక ఉపశమనం కలిగించే లేపనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇలా పథకాలు వెల్లువలా ప్రవహిస్తున్నాయి. డబ్బులను పందేరం చేయకుండా నిరోధించే వ్యవస్థ ఏదీ మనదగ్గర లేకపోవడంతో పన్నులతో బాదడం.. పథకాలు పెట్టడం అన్నచందంగా పాలన సాగుతోంది. ఎపిలో అయితే సిఎం జగన్ చేతికి ఎముక లేదన్నట్లుగా నగదును బదిలీ చేస్తేస్తున్నారు. అదే అద్భుత పాలనగా ప్రకటించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇంతింతై వటుడింతై అన్నట్లుగా ఆర్థిక భారం అనకొండలా పెరిగిపోతోంది. దీనికి ఎక్కడ అంతం అన్నది ప్రజలంతా ఆలోచన చేయాలి. పథకాల వల్ల జరుగుతున్న మంచీ చెడులను చర్చించాలి. ఒక్కో పథకంతో ఒక్కో వర్గాన్ని ఆకట్టుకోవడం ద్వారా ఓట్లు రాల్చే చెట్లలాగా వాటిని పెంచి పోషించడం వల్ల ఆర్థిక ప్రగతి కుంటు పడగలదు. మా తరవాత ఎవరేమైతే మాకేంటని అనుకుంటే సరిపోదు. కిలో రూపాయి బియ్యం పథకం ప్రవేశ పెట్టిన కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయంగా ఎక్కడా లేకుండా పోయారు. పథకాల వడ్డింపులు ఇప్పుడు నిరంతరాయంగా సాగుతున్నాయి. వీటికి మోడీ కూడా అతీతుడేం కాదు. అయితే పన్నులు రూపంలో వసూలు చేస్తున్న డబ్బును ప్రజలు తమకు అధికారం ఇచ్చారన్న అహంతో ఇలా పంచడం ఎంతవరకు సమంజసమో నిలదీయాల్సి ఉంది. తెలంగాణలో దళితులకు తీసుకుని వచ్చిన దళితబంధు కేవలం డబ్బుల పంపిణీ పథకంగా చూడాల్సిందే. ఇప్పుడది కమిషన్లకు దారితీస్తోంది. పథకాన్ని పొందాలనుకున్న వారి నుంచి ఫిఫ్టీ ఫిఫ్టీ కింద వసూళ్లకు తెగబడుతున్నారు. నిజానికి వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు చూపించి, ఇల్లు కట్టించి ఉన్నతంగా తీర్చిదిద్దేలా చేస్తే ఈ దుబారా అసవరం వచ్చేది కాదు. కానీ ఇక్కడ ఓట్లు కూడా రాల్చుకోవాలి కనుక నేరుగా డబ్బులు వెదజల్లే పథకంగా రూపు దిద్దుకుంటోంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ అంటరానితనం, రెండు గ్లాసుల విధానం అమల్లో ఉంది. దళితులు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా ఎంతో వెనుకబడి ఉన్నారు. వారిని ఆర్థికంగా గుప్పిట్లో పెట్టుకున్న సమాజం చిన్నచూపు చూస్తోంది. రాష్ట్రం లో ఎక్కడ ఉపఎన్నికలు జరిగినా కేసీఆర్ ప్రభుత్వ ప్రాధాన్యాలు మారిపోతుంటాయి. హుజూరాబాద్ ఉపఎన్నిక పుణ్యమా అని దళితబంధు పథకం పురుడు పోసుకుంది. దాంతో ఇప్పుడు ఆ పథకం గురించి కేసీఆర్ అద్భుతమని చెబుతున్నారు. దళితుల కు మంచి జరుగుతోందనే పథకం అయితే ఎంతమందికి మంచి చేయగలరో చెప్పాలి.రాజకీయ ప్రయోజనం పొందడం కోసమే దళితబంధు పథకం అమలు చేస్తున్నారని వేరుగా చ ఎప్పాల్సిన అసవరం లేదు. ఈ క్రమంలో విపక్షాలు దళితబంధుతో పాటు, గిరిజన బంధు, మైనార్టీ బంధు కావాలన్న నినాదాలను తెరపైకి తెచ్చి ఆయా వర్గాలను రెచ్చగొడుతున్నాయి. రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్ ఆవిష్కరించిన దళితబంధు పథకం ఆయనకు మేలు చేస్తుందా లేదా అన్నది భవిష్యత్‌లో తేల్చనుంది. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న టీఆర్ఎస్ నాయకులు, మంత్రులకు మాత్రం అది అదనపు ఆదాయాన్ని సమకూర్చే పథకంగా మారింది. దళితబంధు తరహాలో తమకు కూడా ఇటువంటి పథకం అమలు చేయాలని సమాజంలోని వివిధ వర్గాల నుంచి ఇప్పటికే డిమాండ్లు మొదలయ్యాయి. దళితబంధు కింద ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి పది లక్షల రూపాయల చొప్పున పంచిపెట్ట నున్నందున తమకు కూడా అలాగే ఇవ్వాలని బీసీలు, ఆదివాసీలు కోరడం మొదలైంది. ఇది ఎక్కడి వరకు దారితీస్తుందో తెలియదు. దళితబంధును అమలు చేస్తున్నందున ఈ పథకం ఫలాలు తమకు ఎప్పుడు అందుతాయోనని మిగతా నియోజకవర్గాలకు చెందిన దళితులు అప్పుడే డిమాండ్లు పెట్టారు. అలాగే వివిధ రాజకీయ పార్టీలు కూడా వారిని ఎగదోస్తూనే ఉంటాయని గుర్తించాలి. లబ్దిదారుల ఎంపికలో న్యాయం జరగడం లేదని అప్పుడే రభస జరగడాన్ని చూశాం. అదే సమయంలో దళితులు మాత్రమే ఓటర్లా? మేం కాదా? అని బీసీలు, ఇతర వర్గాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పథకాలు నిజంగానే భస్మాసుర హస్తంలా తయారవుతాయనడంలో సందేహం లేదు. అదే సమయంలో తమ నియోజకవర్గంలో అభివృద్ధి కావాలంటే ఉపఎన్నిక రావాల్సిందేనన్న డిమాండ్లు పుట్టుకుని వస్తున్నాయి. తమ నియోజకవర్గాలకు చెందిన శాసనసభ్యులు రాజీనామాలు చేసి ఉపఎన్నికలకు మార్గం సుగమం చేయాలని ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ సదుద్దేశ్యంతోనే దళితబంధును ప్రవేశపెట్టినా అది విపరీత పరిణామాలకు దారితీసే ప్రమాదం కూడా పొంచి ఉంది. అనవస రంగా పందేరాల ద్వారా తేనెతుట్టెను కదిపి నట్లుగానే భావించాలి. ప్రజలలో ఆశలు పుట్టించడం వల్ల అవి నెరవేర్చకపోతే వ్యూహం బెడిసి కొట్టే ప్రమాదం లేకపోలేదు. మరోవైపు కేంద్రప్రభుత్వం విధిస్తున్న షరతుల వల్ల ఎడాపెడా అప్పులు చేయడానికి కూడా వీలు లేని పరిస్థితి ఏర్పడింది. దీనిని అధిగమించేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపడతారన్నదే ముఖ్యం. నిజానికి దేశంతో పాటు అనేక రాష్ట్రాల్లో దళితుల పరిస్థితి దారుణంగా ఉంది. వారికి మంచి జరుగుందని ఇంకా ఎంతకాలం వేచి చూడగలం. ఏదో రకంగా వారికి మంచి జరిగి వారు తమకాళ్లమీద తాము నిలబడగలిగితే మంచిదే. దేశవ్యాప్తంగా దళితుల స్థితిగతులపై అధ్యయనం జరగాలి. ఎపిలో అయితే దళితులపపట్ల ఇంకా కవివక్ష కొనసాగుతోంది. దళితులు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా ఎంతో వెనుకబడి ఉన్నారు. అయితే ఉచిత పథకాల తీరుతో బడ్జెట్ లెక్కలు మారుతున్నాయి. బడ్జెట్‌ను మించి హామీలు గుప్పిస్తున్నారు. దీంతో రానురాను ఇవి మోయలేని భారంగా మారనున్నాయి. అలాగే అన్ని కులాలు, వర్గాల వారు తమకో ..అంటూ రాగం తీస్తున్నారు. ఈ క్రమంలో ఈ పథకాలు గుదిబండగా మారుతున్నాయి. వీటిని సమీక్షించాల్సిన అవసరం ఏర్పడింది. నగదు బదిలీలు, పథకాలను ప్రజలు ఎప్పుడూ కోరుకుంటూనే ఉంటారు. అయితే అర్హులకు మాత్రమే పథకాలు అందితే తప్పులేదు.

పృద్వీరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ప్రజా సంక్షేమం లక్ష్యంగా కెసిఆర్ నిర్ణయాలు

## రెండో విడుత కంటివెలుగులో కోటిన్నర మందికి పరీక్షలు

200 కోట్లు విడుదల చేస్తున్నట్లు మంత్రి హరీష్ రావు ప్రకటన

జనవరి 18 నుంచి రెండో విడుత కార్యక్రమంపై అధికారులతో సమీక్ష

హైదరాబాద్,నవంబర్29(సమ సమాజం): సీఎం కేసీఆర్ ఏ కార్యక్రమం చేసినా.. ప్రజల కోసం ఆలోచించి వారికి ఉపయోగపడేలా చేస్తారని మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ సారి కోటిన్నర మందికి పరీక్షలు చేసి, 55లక్షల మందికి అద్దాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో 30లక్షల మందికి రీడింగ్ గ్లాసెస్, 25లక్షల మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అందరు కలిసి ప్రజలను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ఒకటి రెండుసార్లు ఆలోచించి కార్యక్రమాలు చేపడుతారని, ప్రజల కోణంలోనే ఆలోచిస్తారన్నారు.రెండో విడత కంటి వెలుగు పథకం పై వైద్యాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. జనవరి 18న రాష్ట్ర వ్యాప్తంగా కంటి వెలుగు ప్రారంభం కానుందని ఆయన చెప్పారు. దీనికి సంబంధించి రూ.200 కోట్ల మంజూరికి జీవో ఇచ్చామని తెలిపారు. మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని 8 నెలల పాటు నిర్వహించామన్నారు. ఇప్పుడు రెండో విడత 5 నెలల పాటు చేస్తామన్నారు. మొత్తం 100 పని రోజుల్లో కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని హరీష్ రావు అన్నారు. మొదటి విడతలో కంటి వెలుగు కార్యక్రమం కోసం 827 బృందాలు పనిచేశాయని హరీష్ రావు తెలిపారు. ఈ ఏడాది రెండో విడత కోసం 1500 టీమ్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలో వైద్యరంగంలో ఉన్న ఖాళీలను పూర్తి చేస్తున్నామని తెలిపారు. వైద్యులు, ఎక్విప్మెంట్‌లను కూడా పెంచుతున్నామని అన్నారు. 969 పోస్టుల మెరిట్ లిస్ట్ మరో రెండు రోజుల్లో రిలీజవుతోందని చెప్పారు. రెగ్యులర్ పబ్లిక్ హెల్త్ కార్యక్రమాలతో పాటు కంటి వెలుగు చేస్తామని హరీష్ రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ఇన్వాల్వ్ అవుతారని ఆయన చెప్పారు. ఇక జనవరి 5న కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. అందరు కలిసి ఉత్సాహంగా పని చేసి కంటి వెలుగు-2ని విజయవంతం చేద్దామని మంత్రి రీశ్‌రావు పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జనవరి 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కంటి వెలుగు-2 కార్యక్రమం ప్రారంభంకానున్నది. ఈ సందర్భంగా కార్యక్రమంపై డీహెచ్‌ఓలు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, క్వాలిటీ టీమ్స్, రోగ్రామ్ ఆఫీసర్లకు ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రీశ్‌రావు ప్రారంభించారు. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చారని, ఇంతకు ముందు 1.54కోట్ల మంతికి పరీక్షలు చేసి, 50లక్షల మందికి కంటి అద్దాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వపరంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని, అధికారులంతా పూర్తి బాధ్యతతో పని చేయాలన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వం రూ.200కోట్లు కేటాయించిందన్నారు. గతేడాది ఎనిమిది నెల్లలో కార్యక్రమం నిర్వహించగా.. ఈ సారి వంద పని దినాల్లో చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తొలిసారి 827 బృందాలు పని చేస్తే.. ఇప్పుడు ఆ సంఖ్యను 1500కు పెంచినట్లు చెప్పారు. బృందాలకు అవసరమైన ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తామని, రెగ్యులర్ సర్వీలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. డీఎంహెచ్‌ఓలు బాగా పని చేయాలని, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. జనవరి 5న కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. ఎక్కడా ఇబ్బందులు రావొద్దని, సమస్య వస్తే రీప్లేస్ చేయాలని, బృందాలకు అవసరం అయ్యే ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పూర్తి స్థాయిలో ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఆయా బృందాలకు రోజువారీ ఎ÷-లానింగ్ ఇవ్వాలని, పరీక్షలు చేయించుకోవడం మిస్సయిన వారి కోసం మళ్లీ ఏర్పాటు చేయాలన్నారు. జనవరి ఒకటి వరకు ఆటో రిఫ్రాక్టో మిషన్లు వస్తాయని, కార్యక్రమం ప్రారంభానికి ముందే రీడింగ్ గ్లాసెస్ అందుబాటులోకి వస్తాయన్నారు. పరీక్షలు చేసిన నెల రోజుల్లో ప్రిస్క్రిప్షన్ అద్దాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ÷నైల్ ఇయర్ స్టూడెంట్స్‌కు సైతం శిక్షణ ఇచ్చి.. సేవలను వినియోగించుకుంటామన్నారు. స్టేట్ లెవెల్ 10 క్వాలిటీ కంట్రోల్ బృందం, జిల్లాకో క్వాలిటీ కంట్రోల్ బృందాన్ని నియమించి.. కార్యక్రమం ప్రభావవంతంగా జరుగుతుందా? లేదా? పరిశీలించనున్నట్లు చెప్పారు. ఎల్ వీ ప్రసాద్, సరోజినీ దేవి కంటి ఆసుపత్రి సహకారంతో సిబ్బందికి రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఇస్తామని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్ ద్వారా ఎప్పటికప్పుడు అద్దాల డిమాండ్ తీర్చేలా ఆటోమేటిక్ ఆర్డర్ ఫెసిలిటి ఉంటుందన్నారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా పూర్తి స్థాయి సహకారం ఉంటుందన్నారు. కంటి సమస్యలతో ఏ ఒక్కరూ రాష్ట్రంలో బాధ పడకూడదు అనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. దాన్ని అమలు చేయడంలో మనందరిది ముఖ్య పాత్ర అని, లక్ష్యం నెరవేరేలా అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కంటి వెలుగు బాగా పని చేసే వారికి ప్రశంసలు ఉంటాయని, శాఖ పరమైన గుర్తింపు ఉంటుందన్న ఆయన.. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గొప్ప కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు అయ్యేలా అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లు మోడీ మొహం చూసి ఓటేస్తారు

ఆయనేమైనా రావణాసురుడా..వంద తలకాయలు ఉన్నాయా

గుజరాత్ ప్రచారంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శలు

ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేతలు



అహ్మదాబాద్,నవంబర్29(సమ సమాజం): ప్రధాని మోడీని రావణుడితో పోలుస్తూ.. ఆయనకేమైనా వంద తలలున్నాయా అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీ తన విధులను మరిచిపోయి ప్రచారానికి ప్రాముఖ్యతనిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు ఏవైనా తన గురించే మాట్లాడుతున్నారని అన్నారు. ఎప్పుడూ తన గురించే మాట్లాడుకుంటున్నారు.. ఆయన పేరుతో ఓట్లు అడుగుతున్నారు. ఎన్నిసార్లు ప్రధాని మోడీ ముఖం చూడాలి.. ఆయనకు రావణుడిలా 100 తలలు ఉన్నాయా..? అంటూ ఖర్గే ప్రశ్నించారు. మున్సిపాలిటీ ఎన్నికలు అయినా.. కార్పొరేషన్ ఎన్నికలు అయినా.. లోక్‌సభ, పార్లమెంటు ఎన్నికలు అయినా సరే.. మోడీ పేరుతో ఓట్లు అడగడం నేను చూస్తూనే ఉన్నాను.. అభ్యర్థి పేరుతో ఓట్లు అడగండి.. మోడీ వచ్చి మున్సిపాలిటీకి పనిచేస్తారా? మీకు అవసరమైన సమయంలో మోడీ మీకు సహాయం చేస్తారా..? అంటూ ప్రజలను ప్రశ్నించారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బిజెపి పార్టీ విరుచుకుపడుతోంది. ఖర్గే 'గుజరాత్ పుత్రుడిని అవమానిస్తున్నారు' అంటూ బిజెపి ఆరోపించింది. ఈ వ్యాఖ్యలపై బిజెపి ఐటి సెల్ చీఫ్ అమిత్ మాల్వియా స్పందించారు. గుజరాత్ ఎన్నికల్లో బిజెపిని తట్టుకోలేకే కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలాంటి నియంత్రణ లేని వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. 'మౌత్ కా సౌదాగర్, రావణ్ అంటూ ప్రధాని మోడీని కాంగ్రెస్ పార్టీ అవమానిస్తూనే ఉందని అన్నారు. గుజరాత్‌లో మంగళవారంతో ప్రచారం ముగిసింది. ప్రధాని నరేంద్ర మోడీని రావణాసురుడితో పోలుస్తూ కాంగ్రెస్ ఖర్గే అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు



గుజరాత్ రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి. ఆయన వ్యాఖ్యలను కమలనాథులు తప్పుబట్టారు. గుజరాత్ పుత్రుడిని కాంగ్రెస్ అవమానిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.గుజరాత్ ఎన్నికల వేడిని తట్టుకోలేకనే కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాటతూలారని, ప్రధాన మంత్రిని రావణునితో పోల్చారని అమిత్ మాలవీయ ట్వీట్‌లో ఖండించారు. ఖర్గే మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. 'మౌత్ కా సౌదాగర్' నుంచి 'రావణ్' వరకూ కాంగ్రెస్ అనేక సార్లు విమర్శలు చేస్తూ గుజరాత్‌ను, గుజరాత్ పుత్రుడిని పదేపదే అవమానిస్తోందని అన్నారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు డిసెంబర్ 1,5 తేదీల్లో జరగనున్నాయి. డిసెంబర్ 8న ఫలితాలు వెలువడతాయి.

# రైతులకు అండగా నిలిచిన ఏకైక సిఎం కెసిఆర్

తెలంగాణ ప్రభుత్వంతో ప్రతి ఒక్కరికి పనులు

కళ్యాణలక్ష్మి కింద చెక్కులు అందించిన మంత్రి



జోగులాంబ గద్వాల, నవంబర్ 29 (సమ సమాజం): ఉచితవిద్యుత్, సాగునీరు, రైతుబంధు, రైతుబీమా అందజేసి ప్రతి ఒక్కరికి పని కల్పించి వలసలను నివారించిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీరుస్తున్న ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం వలస పోయేవారని, ప్రస్తుతం ఇతర రాష్ట్ర రైతు కూలీలు తెలంగాణకు వలస వచ్చి పని చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 80 శాతం భూములు సస్యశ్యామలంగా మారాయని అన్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం పై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. రాష్ట్రంలోని 29 వేల పాఠశాలలు బాగు చేయాలనే విధంగా మన ఊరు, మనబడి కార్యక్రమం చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలో రైతుబంధు కింద లక్ష 46 వేల ఎకరాలకు గత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రూ.7,400 కోట్లు ఇచ్చామని అన్నారు. రాష్ట్రంలో ఐదు ఎకరాల లోపు వారు 92 శాతం మంది రైతులు ఉన్నారని అన్నారు. గద్వాలలో వచ్చే సంవత్సరం మెడికల్ కళాశాల వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ కేంద్రం తెలంగాణకే తలమానికమని అన్నారు. రాబోయే తరాలవారికి మంచి పాలన అందించే విధంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లా జడ్పీ చైర్మన్ సరితా తిరుపతయ్య, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, స్థానిక శాసనసభ్యులు కృష్ణ మోహన్ రెడ్డి లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అపుర్వ్ చౌహాన్ ,రాష్ట్ర వినియోగదారుల ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మున్సిపల్ చైర్మన్ బి ఎస్ కేశవ్, గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చంద్, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

# తెలంగాణ రాత మార్చిన విధాత కేసీఆర్

కెసిఆర్ పాలన అద్భుతమన్న ఎర్రబెల్లి

హైదరాబాద్,నవంబర్29(సమ సమాజం): తెలంగాణ రాత మార్చిన విధాత కేసీఆర్ అని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దీక్షా దివస్‌ను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటాలన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించారని, రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతూ అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతూ దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారన్నారు. నేడు తెలంగాణ ఆచరిస్తుంది.. రేపు దేశం అనుసరిస్తుందన్న రీతిలో సీఎం కేసీఆర్ పాలన కొనసాగు తుందని, ప్రతి పౌరుడు తలెత్తుకొని గర్వించేలా రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెబుతున్న మహనీయుడు సీఎం కేసీఆర్ అన్నారు. అలాంటి గొప్ప నేత మనకు దక్కడం తెలంగాణ ప్రజల అదృష్టమన్నారు. తెలంగాణ ప్రగతిని చూసి తట్టుకోలేక బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర సంపదను కొల్లగొట్టేందుకు కుట్రలు చేస్తోందని, తెలంగాణ ప్రజలంతా ఏకోన్ముఖమై ఈ కుట్రలను ఛేదించాలన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచి తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటేందుకు ప్రజలు దీక్ష తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, అభివృద్ధి, భవిష్యత్ కోసం కేసీఆర్ దీక్ష చేపట్టి తాను ఇచ్చిన మాటకు కట్టుబడి నేడు రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిద్దారన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న నాయకత్వానికి అండగా నిలబడేందుకు తెలంగాణ ప్రజలు దీక్ష తీసుకోవాలని కోరారు.

# సిట్ ముందుకు హాజరు కానవసరం లేదు

## రఘురామకు మెయిల్ సందేశం

హైదరాబాద్,నవంబర్29(సమ సమాజం): ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సిట్ ముందుకు నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు హాజరు కావాల్సిన అవసరం లేదంటూ సిట్ మినహాయింపును ఇచ్చింది. దీంతో మంగళవారం నాడాయన విచారణకు హాజరు కావడం లేదు. ప్రస్తుతానికి హాజరు కావాల్సిన అవసరం లేదంటూ ఎంపీ రఘురామకు సిట్ ఈ మెయిల్ సందేశం అందించింది. మళ్లీ అవసరం అయితే పిలుస్తామంటూ ఎంపీ రఘురామకు సిట్ తెలిపింది. నిజానికి రఘురామకు మూడు రోజుల క్రితం సిట్ నోటీసులు జారీ చేసింది. 10:30 కి కమాండ్ కంట్రోల్ సెంటర్ సిట్ కార్యాలయంలో హాజరుకావాలని సూచించింది. నిందితులతో రఘురామ ఫొటోస్ ఇప్పటికే వైరల్ అయ్యాయి. నిందితులతో దగ్గరి సంబంధాలు ఉన్నట్లు సిట్ గుర్తించింది. ఈ క్రమంలోనే నోటీస్‌లు అందుకున్న నలుగురిని నిందితుల జాబితాలో సిట్ చేర్చింది. హాజరు కాకుంటే అరెస్ట్ చేస్తామని తెలిపింది. ఇప్పటికే హాజరుకాని ఇద్దరికి లుకౌట్ నోటీసులు జారీ చేసింది. కానీ నేడు రఘురామకు మాత్రం విచారణకు అవసరం లేదని తెలిపింది.

# ఉద్యోగ నియామకాల పక్రియపై సిఎస్ సమీక్ష

మొదటి పేజి తరువాయి)
హైదరాబాద్,నవంబర్29(సమ సమాజం): రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల పక్రియపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉద్యోగ ఖాళీలు, భర్తీలపై వివిధ శాఖల ఉన్నతాధికారులు, టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తో సీఎస్ సమీక్షించారు. ఇప్పటి వరకు 60,929 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని సీఎస్ తెలిపారు. మరో 16,940 పోస్టులకు మూడు రోజుల్లో అనుమతులు వస్తాయన్నారు. ఉద్యోగాల నియామక పక్రియ వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అధికారులు వచ్చే నెలలో నోటిఫికేషన్లు ఇచ్చేలా వివరాలు అందించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులను సీఎస్ ఆదేశించారు. ఇదిలావుంటే తెలంగాణలో కొలువుల జాతర కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడిన సంగతి తెలిసిందే. ఆయా ఉద్యోగాల భర్తీకి పక్రియ కొనసాగుతోంది.32 గెజిటెడ్, 25 నాన్ గెజిటెడ్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఈ ఉద్యోగాల భర్తీకి సంబంధించి డిసెంబర్ 6 నుంచి 27వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. తదితర వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించొచ్చు.

# షర్మిల అరెస్ట్

మొదటి పేజి తరువాయి)
హైదరాబాద్,నవంబర్29(సమ సమాజం): టీఆర్ఎస్ పార్టీలో ఉన్నది గూండాలు...రౌడీలే అని వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం పోరాడుతుంటే అడ్డుకుంటున్నారని... ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అడ్డుకుంటారా అని ప్రశ్నించారు. తెలంగాణలో అసలు ప్రజాస్వామ్యం ఉందా అని నిలదీశారు. పోలీసుల అనుమతితోనే పాదయాత్ర చేస్తున్నప్పటికీ అడ్డుకుంటున్నారని విమర్శించారు. తమపై దాడులు చేసి.. వాహనాలను ధ్వంసం చేస్తున్నారన్నారు. అన్ని వాళ్లే చేసి.. తాము శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నామం టున్నారన్నారు. బీఆర్ఎస్ అంటే బందిపోట్ల రాష్ట్ర సమితి అని వ్యాఖ్యలు చేశారు. 'నా పాదయాత్రను ఆపేందుకే ప్రభుత్వం కుట్రలు' చేస్తోందని షర్మిల ఆరోపించారు. సోమవారం జరిగిన పరిణామాలకు నిరసనగా షర్మిల మంగళవారం ప్రగతిభవన్‌కు బయల్దేరారు. నర్సంపేటలో ధ్వంసం చేసిన కారులో స్వయంగా డ్రైవ్ చేసుకుని నిరసనకు వెళు తుండగా పంజాగుట్ట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. వాహనం దిగాలని పోలీసులు కోరినప్పటికీ ఆమె వినలేదు. దీంతో ధ్వంసమైన కారు డ్రైవింగ్ సీట్లో షర్మిల కూర్చొని ఉండగానే పోలీసుల క్రేన్‌ను తెప్పించి అక్కడి నుంచి ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల వైఖరిపై వైఎస్సార్ తెలంగాణ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.పాదయాత్ర కొనసాగించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని.. పాదయాత్రను నిలిపివేయాలని షర్మిలను నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు కోరగా ఆమె నిరాకరించారు. ఈ క్రమంలో శంకరాం తండా సమీపంలో నిలిపిన షర్మిల కాన్వాయ్ వాహనంపై కొందరు వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పంటించారు. పక్కనే ఉన్న ఇన్నోవా వాహనం అద్దాలనూ పగలగొట్టారు. అనంతరం షర్మిలను హైదరాబాద్ తరలించారు. మరోవైపు ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేందుకు విజయమ్మ యత్నించిడంతో లోటస్ పాండ్ నివాసంలో ఆమెను హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో విజయమ్మ పోలీసులతో వాగ్వాదానాకి దిగారు. కుమార్తెను చూసేందుకు ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు బయల్దేరిన వైఎస్ విజయమ్మను పోలీసులు అడ్డుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు రానీయకుండా ఇంటి వద్దే పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు.. షర్మిలపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజ్‌భవన్ రోడ్డులో కలకలం సృష్టించిన వైఎస్ షర్మిల కారును.. షర్మిలతో సహా పోలీసులు లిఫ్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ కు చేరుకుని షర్మిలను విడుదల చేయాలని కార్యకర్తలు ఆందోళన చేశారు.

# స్కూళ్లు తెరిచేలోగా యూనిఫామ్ రెడీ

మొదటి పేజి తరువాయి) పేర్కొన్నారు. పాఠశాల విద్య సంచాలకులు కార్యాలయంలో ఏక రూప దుస్తుల పంపిణీ, మన ఊరు - మన బడి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రానున్న విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి 25 లక్షల మంది విద్యార్థులకు 121 కోట్ల రూపాయలతో ఏకరూప దుస్తులను రూపొందించాలని ఆదేశించారు. విద్యార్థులందరూ ఒకే రకమైన దుస్తులు ధరించడం ద్వారా వారి మధ్య తారతమ్యాలు, ఎలాంటి కల్మషాలకు తావు లేకుండా ఉండే అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు. వచ్చే సంవత్సరం ఏప్రిల్ నాటికి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు జిల్లా స్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మన ఊరు - మన బడి కార్యక్రమంలో మొదటి దశలో చేపట్టిన 1200 పాఠశాలల్లో నిర్మాణ పనులు పూర్తయ్యాయని మంత్రి స్పష్టం చేశారు. వీటిలో సీసీ కెమెరాలు, ఫర్నీచర్, ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలను డిసెంబర్ 15 నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మిగతా పాఠశాలల్లో కూడా పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్య సంచాలకులు శ్రీ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

# దీక్షాదివస్‌కు 13 ఏళ్లు

## తెలంగాణ ఉద్యమంలో కీలక సన్నివేశం

కెసిఆర్ దీక్షను గుర్తు చేసుకుంటూ కెటిఆర్, కవితల ట్వీట్

హైదరాబాద్,నవంబర్29(సమ సమాజం): చరిత్రను మలుపుతిప్పిన నవంబర్ 29తేదీ చరిత్రలో చిరస్మరణీయ మైన రోజుగా నిలిచిపోతుందని మంత్రి కెటిఆర్ అన్నారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిన కేసీఆర్ దీక్ష 13 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఉద్యమ నాయకుడిగా ఆయన 'తెలంగాణ తెచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో 2009 నవంబర్ 29న ఆమరణ దీక్షకు దిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నాటి రోజుల్ని మంత్రి కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. 'మీ పోరాటం అనితర సాధ్యం. ఒక నవశకానికి నాంది పలికిన రోజు. ఒక బక్క పలుచని వీరుడు బందూకై తన జాతిని మేలు కొలిపిన రోజు. తెలంగాణ వైపు దేశం దృష్టి మరల్చే విధంగా తెగించిన రోజు. చరిత్రను మలుపు తిప్పిన రోజు నవంబర్ 29, 2009. తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమైన రోజు ఇది. దీక్షా దివస్ అని ట్వీట్ చేశారు. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ 'తెలంగాణ తెచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో 2009 నవంబర్ 29న ఆమరణ దీక్షకు దిగారు. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను ప్రజ్వలింపజేసి, తెలంగాణ రాష్ట్ర సాధనకు అంకురార్పణ చేసిన రోజును టీఆర్ఎస్ దీక్షా దివస్‌గా పాటిస్తున్నది. 2009 నవంబర్ 29న కరీంనగర్‌లోని ఉత్తర తెలంగాణభవన్ నుంచి దీక్షాస్థలి సిద్దిపేటకు కేసీఆర్ బయలుదేరగా, కరీంనగర్ మానేరు బ్రిడ్జి అలుగునూరు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి నుంచి ఖమ్మం జైలుకు తరలించారు. ఆ తరువాత నిమ్స్ దవాఖానకు తరలించారు. అక్కడే కేసీఆర్ దీక్షను 11 రోజుల పాటు కొనసాగించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని డిసెంబర్ 9న యూపీఏ ప్రభుత్వం ప్రకటించిన తరువాతనే ఆయన దీక్షను విరమించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో భాగంగా 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అన్న నినాదంతో 2009, నవంబర్ 29న టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు నేటికి 13 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ... 'కోట్లాది ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు, 'తెలంగాణ వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో' అంటూ ప్రాణాలను పణంగా పెట్టి, సమైక్య పాలకుల నిర్బంధాలను ఛేధించి, సిద్దిపేట కేంద్రంగా ఉద్యమ వీరుడు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన చారిత్రక రోజు... నవంబర్ 29 దీక్ష దివాస్' అంటూ కవిత ట్వీట్ చేశారు.

## తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు పోరాటం



మొదటి పేజి తరువాయి) జైలుకు వెళ్లడానికైనా తాము సిద్ధమేనని స్పష్టం చేశారు. బీజేపీ నాయకులకు మీ జైళ్లు సరిపోవని ఎద్దేవా చేశారు. మాట తప్పం.. మడమ తిప్పం అని సవాల్ చేశారు. ఆడబిడ్డ అని చూడకుండా పోలీసులు షర్మిలను కూడా అడ్డుకున్నారన్నారు. పోలీసుల ముందు టీఆర్ఎస్ నాయకులు పెట్రోల్ పోసి తగలబెట్టే పరిస్థితి ఉందని ఆరోపించారు. అసలు ఈ తెలంగాణలో శాంతి, భద్రతలున్నాయా.. ఈ పోలీసులు శాంతి, భద్రతల కోసం ఉన్నారా.. ప్రతిపక్షాలను అణిచివేయడం కోసం ఉన్నారా అని నిలదీశారు. ఇంతటి దుర్మార్గం ఎప్పుడూ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసీఆర్ తెలంగాణను ఎటు తీసుకపోతున్నారని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ తెలంగాణలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని, ఈ రోజు రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా, మద్యం తెలంగాణాగా మార్చేశారని ఆరోపించారు. ఈ మధ్య తాను మునుగోడులోని ఓ గ్రామానికి వెళ్లినపుడు.. అక్కడ ఎన్ని మద్యం షాపులున్నాయని అడిగితే.. 50మందికి ఒకటి చొప్పున, ముప్పై మందికి ఒకటి బెల్టు షాపులున్నాయని చెప్పారని కిషన్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ సాధించిన ఘనత ఇది అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు ప్రధాని మీద, గవర్నర్ మీద, ఉద్యమాల మీద గౌరవముండదని ఆరోపించారు. పోలీసులను టీఆర్ఎస్ ఏజెంట్లలాగా వాడుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేస్తున్న పార్టీలను పోలీసులు అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. తెలంగాణలో కేసీఆర్ పతనం ప్రారంభమైందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ కు ఒక్కసీటు రాదని తేల్చి చెప్పారు. మోడీ వస్తే ఫామ్ హౌస్‌లో దాక్కునే కేసీఆర్.. ప్రధానిని గద్దె దించుతాడనడం హాస్యాస్పదమన్నారు. వెయ్యి మంది కేసీఆర్ లు, ఓవైసిలు వచ్చినా, వెయ్యి బీఆర్ఎస్ పార్టీలు పెట్టినా 3వ సారీ ప్రధాని మోడీనే అవుతారని చెప్పారు. బీజేపీ అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబం భరతం పట్టి, అక్రమాస్తులను పేదలకు పంచి పెడుతామని స్పష్టం చేశారు. దళితబంధు ఈటెల రాజేందర్ వల్లే వచ్చిందని, లబ్దిదారులు ఈటల, మోడీ ఫొటోలు పెట్టుకోవాలని చెప్పారు. బీఆర్ఎస్ పేరుతో వైఫల్యాలపై ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారన్న కిషన్ రెడ్డి... సంగ్రామ యాత్రకు ప్రజలు దీవించి అండగా ఉండాలని కోరారు. తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని ప్రభుత్వంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినట్లు కేసీఆర్ సర్కార్ వ్యవహరిస్తోందన్నారు. ఫామ్‌హౌస్‌లో పండుకునే కేసీఆర్ బీఆర్ఎస్ తో బీజేపీ ని, మోదీని అడ్డుకుంటారంట అని ఎద్దేవా చేశారు. ఎన్ని బీఆర్ఎస్‌లు, ఎంఐఎంలు కలిసి వచ్చినా మోదీని అడ్డుకోలేరన్నారు. మోదీ మూడోసారి ప్రధాని అవడం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ నేతల అవినీతి సొమ్ము కక్కించి పేదలకు ఇస్తామన్నారు. గ్రానైట్, ఇసుక క్వారీలు కల్వకుంట్ల కుటుంబ చేతుల్లో ఉన్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలను అణచివేయడం, ప్రజాధనాన్ని దోపిడీ చేయడం జరుగుతోందన్నారు. బీజేపీ, ఈటలను ఓడించేందుకే దళితబంధు తెచ్చారని ఆయన పేర్కొన్నారు.

## మొబైల్ ఛార్జింగ్‌తో షాక్

మొదటి పేజి తరువాయి) తరగతి చదువుతోంది. ఇంట్లో మొబైల్ ఫోన్ చార్జింగ్ తీస్తూ కరెంట్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లు సరిగా పనిచేయకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని రోజులుగా ఫ్యాన్లు, టీవీలు కాలిపోతున్నాయని చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలిక మృతికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు చెబుతున్నారు.

## ప్రజలకోసం పనిచేయండి

మొదటి పేజి తరువాయి) జనరల్ పేర్కొన్నారు. మీడియా సాక్షిగా అర్వింద్ పై బెదిరింపులకు దిగారని రచన కోర్టుకు తెలిపారు. ధర్మపురి అరవింద్ అసభ్యకర స్టేట్మెంట్‌లు చేశారని ఏజీ పేర్కొన్నారు. పొలిటీషియన్ ఒకరిపై ఒకరు కామెంట్స్ చేసుకోవడం సహజమేనని హైకోర్టు పేర్కొంది. త్వరతగతిన దర్యాప్తు పూర్తి చేయాలని హైకోర్టు సూచించింది. ఇంకా నిందితులు ఎవరైనా ఉంటే వారిని సైతం చేర్చాలని తెలిపింది. వాదనలు పూర్తి కావడంతో విచారణ ముగిసింది.

## తనను చంపుతానంటూ కవిత బెదిరించారు

(మొదటి పేజి తరువాయి) ఎంపీ ధర్మపురి అర్వింద్ హైకోర్టును ఆశ్రయించారు. తనను చంపుతానని మీడియా సాక్షిగా బెదిరించిన కవితపై చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలు చేశారు. తనను బెదిరించడంతో పాటు తన కుటుంబసభ్యులను అవమానించిన ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని పిటిషన్?లో పేర్కొన్నారు. తన ఇంటిపై దాడి చేసిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్ ను జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి బెంచ్ విచారించనుంది. అర్వింద్ తరఫున అడ్వొకేట్ రచన రెడ్డి వాదనలు వినిపించనున్నారు. ఈ నెల 18న టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎంపీ అర్వింద్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీ మారుతున్నానంటూ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన వ్యాఖ్యలపై ÷ర్ అయ్యారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే... నిజామాబాద్ చౌరస్తాలో చెప్పుతో కొడతానంటూ వార్నింగ్ ఇచ్చారు. అర్వింద్ ఎక్కడ పోటీ చేసినా వెంటాడి ఓడిస్తామని హెచ్చరించారు. అర్వింద్ కాంగ్రెస్ నేతలతో టచ్ లో ఉన్నాడని చెప్పారు. ఓ ఆడబిడ్డపై అర్వింద్ ఇలా మాట్లాడటమేంటని ప్రశ్నించిన కవిత అర్వింద్ ఇంకోసారి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే కొట్టి చంపుతామని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు జర్నలిస్టుల దుర్మరణం




భోపాల్,నవంబర్29(సమ సమాజం): మధ్యప్రదేశ్ విదిషలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు జర్నలిస్టులు దుర్మరణం చెందారు. సలామత్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భోపాల్ ? విదిషా రోడ్డులోని లంబాఖేడా (బర్ఖేడి)లో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో విదిషలో ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ రాజేశ్ శర్మతో పాటు సునీల్ శర్మ, నరేంద్ర దీక్షిత్ అనే జర్నలిస్టులు మృతి చెందారు. జర్నలిస్టుల మృతికి రాష్ట్ర సీఎం శివరాజ్ సింగ్ సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

## సీనియర్ జర్నలిస్ట్ గుంటి ప్రభాకర్ హఠాన్మరణం

### ప్రభాకర్ మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మిత్రులు

హైదరాబాద్,నవంబర్29(సమ సమాజం): సీనియర్ జర్నలిస్ట్ గుంటి ప్రభాకర్ హఠాన్మరణం పొందారు. ఉదయం దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా జీవితం ప్రారంభించిన ప్రభాకర్ మంచి జర్నలిస్టులగా పేరు గడించారు. ఉదయం మూసివేత తరవాత మెగాసిటీ పత్రికను స్థాపించి దానిని కొనసాగిస్తున్నారు. గుంటి ప్రభాకర్ సోమవారం రాత్రి 11-30 కి బ్రెయిన్ స్ట్రోక్ తో అకాలమరణం పొందారు. ఆయన మృతికి ఉదయం జర్నలిస్టు మిత్రులతో పాటు, సిబ్బంది, జర్నలిస్ట్ సంఘాలు తీవ్ర విచారం, సంతాపం వ్యక్తం చేశాయి.

## మధ్యప్రదేశ్‌లో కొనసాగుతున్న రాహుల్ యాత్ర



మొదటి పేజి తరువాయి) పేదల కష్టాలు టీవీల్లో కనిపించడంలేదని విమర్శించారు. ఎక్కడకు వెళ్లినా.. ఎటు చూసినా పేదల కష్టాలు చూస్తుంటే బాధ కలుగుతుందని రాహుల్ అన్నారు. పాదయాత్ర నినోరా గ్రామానికి చేరుకున్న అనంతరం రాహుల్ కాసేపు విరామం తీసుకున్నారు. మధ్యాహ్నం నినోరా సమీపంలోని ఉజ్జయిని మహాకాళేశ్వర స్వామి ఆలయాన్ని రాహుల్ గాంధీ సందర్శించనున్నారు. ఆలయానికి వెళ్లే ముందు నినోరా సమీపంలోని జైన మత ప్రదేశాన్ని సందర్శిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. సాయంత్రం ఉజ్జయినిలో జరిగే బహిరంగ సభలో రాహుల్ గాంధీ ప్రసంగించనున్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 380 కిలోమీటర్ల దూరం కొనసాగనుంది. నవంబర్ 23న మహారాష్ట్ర నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ జిల్లాలోకి ప్రవేశించిన రాహుల్ పాదయాత్ర రాష్ట్రంలో 12 రోజులపాటు కొనసాగనుంది. డిసెంబర్ 4న రాజస్థాన్‌లోకి ప్రవేశిస్తుంది.

## నివాసయోగ్యమైన ఉత్తమ నగరంగా హైదరాబాద్




మొదటి పేజి తరువాయి) హైదరాబాద్‌లో నిర్వహించిన రీ ప్లానెట్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గత 5 వేల సంవత్సరాల్లో జరిగిన నగరీకరణ రాబోయే 50 ఏండ్లలో జరుగుతుందన్నారు. నగరీకరణతో పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. దేశంలో పట్టణీకరణ వేగంగా జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉందన్నారు. హైదరాబాద్‌లో రోజు 6 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు సేకరిస్తున్నామని తెలిపారు. వ్యర్థాలతో కరెంట్ ఉత్పత్తి చేసేందుకు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీల్లో ఎఫ్ఎస్‌డీపీ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. తెలంగాణకు జీడీపీ 45 శాతంపైగా అర్బన్ సిటీ నుండి వస్తుందన్నారు. హైదరాబాద్ బెస్ట్ సిటీ ఇన్ ఇండియా అని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రీనర్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ మధ్య కాలంలో క్లౌడ్ బరెస్ట్ అయ్యి ఒకే చోట భారీ వర్షపాతం నమోదవుతుందని గుర్తు చేశారు. డ్రై వేస్ట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. అన్ని మున్సిపాలిటీల్లో సివరేజ్ ఎలాంట్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. దోమకొండ పోర్ట్, కులీకుతుబ్ షా పోర్టు యునెస్కో గుర్తింపు పొందిందని తెలిపారు. తెలంగాణలో 118 పురాతన కట్టడాలు పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. దేశంలో పట్టణీకరణ జరుగుతున్న నగరాల్లో తెలంగాణ రాష్ట్రం ముందుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## భైంసాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తా



మొదటి పేజి తరువాయి) నిర్మల్,నవంబర్29(ఆర్ఎన్ఎ): తాము అధికారంలోకి రాగానే భైంసా పేరును మైసాగా మారుస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే భైంసాను దత్తత తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామన్నారు. భైంసాకు భరోసా ఇవ్వడానికే ఈ యాత్ర చేపట్టామని స్పష్టం చేశారు. సంగ్రామయాత్రలో భాగంగా భైంసాలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఈ రాష్ట్రంలో కాషాయం జెండా రెపరెపలాడాలని బండి సంజయ్ అన్నారు. తాము అధికారంలోకి రాగానే భైంసాలోని బీజేపీ కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసులు, పీడీ యాక్ట్ లను ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్‌కు మూడిందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. దేశాన్ని అప్పుల పాలు జేసిండని, అధోగతి పాలు చేసిండని, ఒకవైపు దేశం అభివృద్ధి చెందుతుంటే.. తెలంగాణ మాత్రం అధోగతి పాలైతుందని బండి సంజ్రయ్ ఆరోపించారు. రూ.5 లక్షల కోట్లు ఎక్కడ పెట్టారో కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క సంవత్సరం లోపల పది లక్షల ఉద్యోగాలిస్తనన్న నరేంద్ర మోడీ.. ఒక్క రోజులోనే 75వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలిచ్చారని చెప్పారు. కేసీఆర్ మాత్రం ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇవ్వలేదని ఆరోపించారు. ముథోల్‌లో ఎంతమందికి నిరుద్యోగ భృతి ఇచ్చినవ్, ఎంతమంది రైతులకు రుణమాఫీ చేసినవ్.. ఎందుకు అభివృద్ధి చేయడం లేదని నిలదీశారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు తాము సమస్యలు పరిష్కారం చేయమని నిరసన చేస్తే.. ఈ రోజు వాళ్లపై ర్యాగింగ్ కేసులు పెడ్తామని, వాళ్ల సర్టిఫికెట్లు క్యాన్సిల్ చేస్తామంటున్నాడని బండి సంజయ్ ఆరోపించారు. వాళ్లు అడిగింది గొంతెమ్మ కోరికలేం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నీ చుట్టపోడు కాబట్టే.. ఉద్యమం చేస్తున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెడ్తున్నరని ఆరోపించారు. వారిపై కేసులు పెడితే తాము దేనికైనా తెగించి, కొట్లాడతామని స్పష్టం చేశారు. కనీసం ప్రాజెక్టులను మెయింటెన్స్ చేయలేని నిస్సహాయ పరిస్థితిలో ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నడని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. అందుకే బీజేపీ సంగ్రామ యాత్ర చేపట్టిందన్న ఆయన.. భైంసా ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, మీకు అండగా బీజేపీ ఉంటుందని స్పష్టం చేశారు.

## మెదక్ బిషప్ సాల్మన్ రాజ్‌పై సస్పెన్షన్ వేటు



మెదక్,నవంబర్29(సమ సమాజం): మెదక్ సీఎస్ఐ చర్చి బిషప్ రెవరెండ్ సాల్మన్ రాజ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విబేధాలు, ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో సాల్మన్ రాజ్‌ను తొలగిస్తూ సినాడ్ నిర్ణయం తీసుకుంది. ఇంఛార్జి బిషప్‌గా డోర్నకల్ బిషప్ రైట్ రెవరెండ్ పద్మారావుకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో ఈరోజు సికింద్రాబాద్‌లో పద్మారావు బాధ్యతలను చేపట్టనున్నారు.

## ఫిబ్రవరి 1నుంచి 4 వరకు మేడారం మినీ జాతర

మొదటి పేజి తరువాయి) వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 4 వరకు మినీ జాతర నిర్వహిస్తున్నట్లు పూజారులు తెలిపారు. ఫిబ్రవరి 1న మండమెలిగే పండగ నిర్వహిస్తామని ప్రకటించారు. 2వ తేదీన సారలమ్మ అమ్మవారి గద్దె..మూడో తేదీన సమ్మక్క గద్దె శుద్ధి చేసి.. సమ్మక్క ? సారలమ్మలకు భక్తులు మొక్కులు సమర్పించుకునేందుకు అనుమతిస్తామని చెప్పారు. మినీ మేడారం జాతరలో అమ్మవార్లను గద్దెలపైకి తీసుకరారు. గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయనున్నారు. కాగా ప్రతి రెండేళ్లకోసారి మేడారం మహాజాతర జరుగుతుంది.

## గుజరాత్ ఎన్నికల్లో ఆప్ దూకుడు



మొదటి పేజి తరువాయి) అర్మమన్నారు. కేజ్రీవాల్ డైమండ్ కటింగ్, పాలిషింగ్ యూనిట్‌ను సందర్శించి వారి సమస్యలను అర్థం చేసుకోవడానికి వ్యాపారులు,కార్మికులతో సంభాషించారు. వారిని ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడుతూ 'ఈ రోజు ఇక్కడ పెద్ద సంఖ్యలో వజ్రాల వ్యాపారులు, కార్మికులు ఉన్నారు. మీరు దేశానికే కాదు యావత్ ప్రపంచానికే గర్వకారణమని మీ అందరికీ నేను చెప్పాలనుకుంటున్నాను. ప్రపంచంలోని వజ్రాల్లో మూడింట ఒక వంతు ఉత్పత్తి ఇక్కడే అవుతున్నాయి. సూరత్ నుంచి ఎగుమతి అయ్యే ఈ వజ్రాలను మీరే తయారు చేస్తారు.. కానీ నా దృష్టిలో మీరంతా వజ్రాలేనని అన్నారు. వజ్రాల వ్యాపారులు పని చేయడంలో ప్రభుత్వం నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి తాను విన్నానని ఆయన అన్నారు. ఇది సమస్య కాకూడదు. ఎందుకంటే నా ప్రకారం, సూరత్‌లోని వజ్రాల వ్యాపారులు,నగల వ్యాపారులను భారతరత్నతో సత్కరించాలి. మీరు దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతున్నారు. దేశం కోసం ఇంత గొప్ప పని చేస్తున్నారు అని ఆప్ నాయకుడు తన ప్రసంగంలో పేర్కొన్నాడు. ప్రతిచోటా.. వ్యాపారవేత్తలను బెదిరించడం, అవమానిం చడం, దుర్భాషలడి బలవంతపు వసూళ్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. గుజరాత్‌లో ఆప్ అధికారంలోకి వస్తే.. గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వ్యాపారవేత్తలు ఖాళీ స్థలాలను అతి తక్కువ ధరలోనే పొందగలుగుతారు. తద్వారా వారు అధిక అ÷-దదె చెల్లించాల్సిన అవసరం లేదు'అని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. వ్యాపారులు వారి అవసరాలకు అనుగుణంగా రుణం పొందేలా ఆప్ ప్రభుత్వం హామీ ఇస్తుందని, వ్యాపారులను మోసం చేసే కేసులకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను చాలా క్లిష్టతరం చేసిందని, ప్రజలు వ్యాపారం చేయడం కష్టంగా మారిందని సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. కాగా, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో డిసెంబర్ 1, 5 తేదీలలో రెండు దశలుగా జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 8న వెలువడుతాయి.

## 24 గంటల కరెంట్ చూపిస్తే కెసిఆర్‌కు పాలాభిషేకం

**వైఎస్ షర్మిల యాత్రప దాడి చేయడం దారుణం**

**వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన తీరు క్షంతవ్యం కాదు**

**మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

జగిత్యాల,నవంబర్29(సమ సమాజం): ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్ఫార్మర్ ఒక్కటి చూపించినా కేసీఆర్‌కు క్షీరాభిషేకం చేస్తానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. వైఎస్ విగ్రహం ధ్వంసం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఎస్ చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కొనసాగింపు మాత్రమేనని ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యయుతంగా యాత్రలు చేపడితే పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీ దాడులు చేస్తుంటే పోలీసులు నిచ్చేష్టులై చూడడం అందరూ ఖండించాలన్నారు. విమర్శలు చేస్తే చట్టపరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి కానీ దాడులు చేయడం ఇదేం సంస్కృతి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్న జీవన్ రెడ్డి... వైఎస్ విగ్రహం పునః ప్రతిష్ఠింపజేయడం ప్రభుత్వం బాధ్యత అని చెప్పారు. ఆడబిడ్డని కూడా చూడకుండా దాడి చేయడం, యాత్రను అడ్డుకోవడం ఏమిటని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. అనుమతి పొందిన యాత్రకు పోలీసులు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత అని, వైఎస్ పై అభిమానంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే ధ్వంసం చేయడం ఇదేం ప్రజాస్వామ్య విధానమని అన్నారు. ఆడబిడ్డ పార్టీకి అధ్యక్షురాలిగా ఉండకూడదా... బూర్జువ మనస్తత్వంతో మీకు మాత్రమే పాలించే అర్హత ఉందా అని నిలదీశారు. వైఎస్ విగ్రహం ధ్వంసం చేయడం, రైతులు, మహిళలు, విద్యార్థులు మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత వైఎస్ దేనన్న జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. వైఎస్ రైతుల్లో ఆత్మస్థైర్యం కల్పించారని, తెలంగాణలో రీయింబర్స్మెంట్‌తో విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. ఆరోగ్యశ్రీ అమలు చేసిన ఘనత వైఎస్ దేనని కొనియాడారు. మహిళా సంఘాలకు పావలా వడ్డీకి రుణం ఇచ్చారన్నారు. సిలిండర్ ధర పెరిగితే మహిళలపై భారం పడొద్దని అదనపు భారం భరించారని తెలిపారు. అర్హత ప్రాతిపదికన ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చారని, కానీ కేసీఆర్ పాలనలో ఎక్కడా డబుల్ బెడ్రూం కనపడతలేదని ఆరోపించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చారన్నారు. పాదయాత్రలో వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల పై దాడిని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆడబిడ్డ మీద దాడులు చేయడం సరికాదన్నారు.



శాంతియుతంగా యాత్రలు చేస్తే అడ్డుకుంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఆడబిడ్డ పార్టీకి అధ్యక్షురాలుగా ఉండకూడదా... యాత్రలు చేయొద్దా అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు.




# చలన చిత్రం



## రష్యన్‌లోనూ పుష్ప విడుదలకు సన్నాహాలు

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొంది గత ఏడాది డిసెంబర్ లో విడుదల అయిన పుష్ప సినిమా సంచలన విజయాన్ని సొంతం చేసుకున్నది. హిందీలో ఈ సినిమా సైలెంట్ గా విడుదల అయ్యి అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. పుష్ప సినిమా వంద కోట్ల వసూళ్లను కేవలం బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద రాబట్టిన విషయం తెల్సిందే. పుష్ప మొత్తంగా 400 కోట్ల వసూళ్లు సాధించింది అంటూ యూనిట్ సభ్యులు చెబుతున్నారు. పుష్ప సినిమా విడుదల అయ్యి ఏడాది కాబోతున్న ఈ సమయంలో రష్యన్ భాష లో విడుదల చేసేందుకు సిద్ధం అయ్యారు. రష్యా లో ఇండియన్ సినిమా లు స్థానిక భాషలో విడుదల అవ్వడం చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. అలాంటిది ఈ సినిమా ను రష్యన్ లాంగ్వేజ్ లో విడుదల చేసేందుకు సిద్ధం చేయడం ఆశ్చర్యంగా ఉందంటూ బాలీవుడ్ వర్గాల వారు కూడా మాట్లాడుకుంటున్నారు. ఇండస్ట్రీ హిట్ సొంతం చేసుకున్న ఎన్నో సినిమాలను పక్కన పెట్టి పుష్ప సినిమాను రష్యన్ లాంగ్వేజ్ లో విడుదల చేసేందుకు సిద్ధం అవ్వడం చూస్తూ ఉంటేనే కచ్చితంగా ఈ సినిమా పై యూనిట్ సభ్యులకు బాగా నమ్మకం ఉంది.. ఆ నమ్మకం కు తగ్గట్లుగా ఈ సినిమా ఆడుతుందని అంటున్నారు. రష్యా లో పుష్ప సినిమా కు మంచి ప్రమోషన్ చేస్తూ విడుదల చేయబోతున్నారు. డిసెంబర్ 8వ తారీకున ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లుగా ప్రకటించారు. చిత్ర యూనిట్ సభ్యులతో పాటు అల్లు అర్జున్ ఫ్యాన్స్ చాలా నమ్మకంతో పుష్ప రష్యన్ లాంగ్వేజ్ రిలీజ్ కోసం మరియు అక్కడ రాబోతున్న స్పందన కోసం వెయిట్ చేస్తున్నారు. పుష్ప సినిమా రష్యా లో విజయాన్ని సొంతం చేసుకుంటే కచ్చితంగా భవిష్యత్తు పూర్తిగా మారుతుందనే అభిప్రాయంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. బన్నీకి జోడీగా ఈ సినిమా లో శ్రీవల్లి పాత్రలో రష్మిక మందన్నా నటించిన విషయం తెల్సిందే. ఇక ఈ సినిమా యొక్క రెండవ పార్ట్ చిత్రీకరణ మొదలు అయ్యిందని.. వచ్చే ఏడాది చివర్లో పుష్ప 2 వస్తుందని యూనిట్ సభ్యుల ద్వారా తెలుస్తోంది.

## వారసుడి నుంచి నేడు రంజితమే పాట విడుదల




తమిళ్ సూపర్ స్టార్ విజయ్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న వారసుడు సినిమా విడుదలకు సిద్ధం అవుతోంది. సంక్రాంతికి విడుదల కాబోతున్న వారసుడు సినిమా నుండి ఒక్కొక్కటి చొప్పున పాటలను విడుదల చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ సినిమా నుండి రంజితమే అనే పాటను ఈనెల 30న విడుదల చేసేందుకు సిద్ధం అయ్యారు. రంజితమే పాట విడుదలకు సంబంధించిన విషయాన్ని ప్రకటిస్తూ ఈ పోస్టర్ ను చిత్ర యూనిట్ సభ్యులు విడుదల చేయడం జరిగింది. ప్రస్తుతం ఈ పోస్టర్ తమిళనాట మరియు తెలుగు రాష్ట్రాల్లో కూడా వైరల్ అవుతోంది. విజయ్ యొక్క లుక్ ను ఇప్పటికే వారసుడు నుండి విడుదల చేయడం జరిగింది. మొదటి సారి రష్మిక మందన్నా యొక్క వారసుడు లుక్ ను ఈ పోస్టర్ తో రివీల్ చేయడం జరిగింది. సూపర్ స్టార్ తో రష్మిక మందన్నా జోడీ ఎలా ఉంటుందో అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూశారు. ఈ పోస్టర్ ను చూస్తూ ఉంటే వారసుడు సినిమాలో వీరిద్దరి జోడీ చాలా క్యూట్ గా ఉంటుందని అనిపిస్తుందని ఇండస్ట్రీ వర్గాల వారు మాట్లాడుకుంటున్నారు. ఈ స్టిల్ లో విజయ్ ని వెనుక నుండి హగ్ చేసుకున్న రష్మిక చాలా క్యూట్ గా ఉందనే టాక్ వినిపిస్తుంది. పుష్ప సినిమాలో శ్రీవల్లి పాత్ర ను చేయడం ద్వారా మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ రష్మిక మందన్నా ఈ సినిమా తో మరోసారి తన పాన్ ఇండియా స్టార్ డమ్ ను నిరూపించుకోవడం ఖాయం అంటూ ఆమె అభిమానులు ఈ స్టిల్ ను చూసిన తర్వాత అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో రష్మిక మరోసారి ఈ స్టిల్ తో వైరల్ అవుతోంది. రష్మిక మందన్నా ఈ సినిమాలో అందాల ఆరబోత తో అభిమానులకు పిచ్చెక్కించడం ఖాయం అన్నట్లుగా అనిపిస్తుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. విజయ్ అంటే తనకు అభిమానం అని.. ఆయనతో నటించే అవకాశం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లుగా వారసుడు సినిమా ప్రారంభానికి ముందు రష్మిక వ్యాఖ్యలు చేసింది. సంక్రాంతికి రష్మిక మరో విజయాన్ని సొంతం చేసుకుంటుందేమో చూడాలి.

## అందాలతో కట్టి పడేస్తున్న పాయల్‌ం



సరిగ్గా హాట్ బ్యూటీ పాయల్ రాజ్ పుత్ న్యూ ఫోటో ఒకటిప్పుడు అలాంటి పరిమళాన్నే విరజిమ్ముతోంది.

కుర్రకారుకి మంటలు పుట్టించేలా ఆ క్లీవేజ్ సెగల గురించైతే చేప్పేదేముంది. అగ్గి రాజేసే అందాలతో మతులు చెడగొడుతుంది. అమ్మడి పెదాలపై అందమైన నవ్వు మరింత కవ్వింపు చర్య అనొచ్చు. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. అభిమానులు తమైదన శైలిలో కామెంట్లు గుప్పిస్తున్నారు. అమ్మడు ఏదో ఈవెంట్ కి హాజరైన సమయంలో క్లిక్ మనిపించిన పిక్ లా ఉంది. పిక్ ఏదైనా పరిమళం మాత్రం అద్భుతం. ఇలాంటి దుస్తుల్లో కనిపించడం కొత్తేం కాదు. గులాబీ వర్ణంలో మరింత వన్నెతో హైలైట్ అవుతుంది. ఇంతకు మించిన అగ్గిరాజేసే ఫోటోలతో చాలాసార్లు కైపెక్కించింది. కానీ ఈ మధ్య కాలంలో ఇంతటి ఫ్రెష్ నెస్ ని మరో స్నాప్ తీసుకురాలేదు. ఇక పాయల్ కెరీర్ సంగతి చూస్తే.. నటిగా బిజీగా ఉంది. తెలుగు..తమిళ్..కన్నడ భాషల్లో సినిమాలు చేస్తోంది. టాలీవుడ్ లో 'కిరాతక' చిత్రంతో పాటు మరో చిత్రంలో నటిస్తోంది. కోలీవుడ్ లో 'ఏంజిల్' అనే సినిమా చేస్తుంది. ఇటీవలే కన్నడలో 'హెడ్ బుష్' అనే డాన్ స్టోరీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈసినిమాపై భారీ ఆశలే పెట్టుకుంది గానీ..ఫలించినట్లు లేదు.



## వైద్య వృత్తిలోకి సాయిపల్లవి ?

ఈ మధ్య నటి సాయిపల్లవికి మళ్లీ గ్యాప్ వచ్చింది. చేతిలో సినిమాలు కూడా లేవు. గత ఏడాది నానితో 'శ్యామ్ సింగరాయ్' నాగచైతన్యతో 'లవ్ స్టోరీ' వంటి సినిమాల్లో నటించి వరుస విజయాల్ని దక్కించు కుంది. ఇక ఈ ఏడాది సోలోగా 'గార్గి' రానాతో కలిసి 'విరాట పర్వం'లో నటించింది. ఈ రెండు సినిమాలు సాయి పల్లవికి ఆశించిన ఫలితాన్ని అందించలేకపోయాయి. 'గార్గి' ప్రశంసలు కురిపించినా సక్సెస్ ని మాత్రం అందించలేకపోయింది. ఈ ఏడాది ఈ రెండు సినిమాలతో ప్రేక్షకులని పలకరించిన సాయి పల్లవి తెలుగులో పలు క్రేజీ ఆఫర్లని వదులుకుంది. ప్రస్తుతం తన చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. దీంతో సాయి పల్లవి సినిమాలకు గుడ్ బై చెప్పబోతోందని తన స్వస్థలమైన కోయంబత్తూర్ లో సొంతంగా హాస్పిటల్ ని నిర్మించాలనుకుంటోందని సోసల్ మీడియా వేదికగా ఓ వార్త హల్ చల్ చేస్తోంది. దీంతో సాయి పల్లవి అభిమానులు కలవరానికి గురవుతున్నారు. ఇదిలా వుంటే సాయి పల్లివి తమిళంలో ఓ భారీ మూవీని అంగీకరించినట్టుగా తెలుస్తోంది. కమల్ హాసన్ తన రాజ్ కమల్ ఇంటర్నేషనల్ నిర్మాణంలో శివ కార్తికేయన్ తో ఓ మూవీని నిర్మించబోతున్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఈ మూవీలో శివ కార్తికేయన్ కు జోడీగా సాయి పల్లవి నటించనుందని తెలుస్తోంది. తాజా వార్తల నేపథ్యంలో సాయి పల్లవి పై వస్తున్న వార్తల్లో నిజమెంత? . జార్జియాలో ఎంబీ బీఎస్ పూర్తి చేసిన సాయి పల్లవి నిజంగానే హాస్పిటల్ ని నిర్మించ బోతోందా?.. సినిమాలకు దూరం కాబోతోందా? అన్నది తెలియాలంటే స్వయంగా సాయి పల్లవి ఈ వార్తలపై క్లారిటీ ఇవ్వాల్సిందే.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA, Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**, RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in